క్లుప్తంగా

నేడు ఉచిత కంటి వైద్య శిబిరం

వేంపల్లె : పట్టణంలోని స్థానిక శ్రీచైతన్య పాఠశాల ఆవరణలో ఆదివారం ఉదయం మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఉచిత మెగా కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ చైర్మన్ చక్రపాణిరెడ్డి తెలిపారు. తిరుపతికి చెందిన శ్రీ వెంకటేశ్వర అరవింద్ కంటి ఆసుపత్రి సహకారంతో మానవతా ఆధ్వర్యంలో ఉచిత కంటి పరీక్షలు చేయిస్తున్నామని, ఆపరేషన్ అవసరమైన వారికి తిరుపతికి తీసుకెళ్లి ఉచితంగానే కంటి ఆపరేషన్లు చేస్తారన్నారు. కంటి అద్దాలు అవసరమైన వారికి, ఉచితంగా మందులను ఇస్తారన్నారు. దృష్టి లోపం, కంటి సమస్యలు ఉన్న వారందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

7 గంటలు విద్యుత్ కోత

ముద్దనూరు : మండలంలో శనివారం ఏకధాటిగా 7 గంటలపాటు విద్యుత్ కోత విధించడంతో మండల వాసులు తీవ్ర అవస్థలకు గురయ్యారు. సబ్‌స్టేషన్ మరమ్మతుల కారణంగా ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం వుంటుందని విద్యుత్ శాఖ ప్రకటించారు. అయితే ఉదయం 7.30 గంటల నుంచి మధ్యాహ్నం 2.30 వరకు ఏకధాటిగా విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. దీంతో మండల వాసులు తాగునీటి సరఫరాలేకపోవడంతో పాటు ఎండవేడిమి అధికంగా వుండటంతో ప్రజలు ఉక్కపోతతో ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మెయిన్ సప్‌లై నుంచి సరఫరా ఆగిపోవడంతో ముందే విద్యుత్ సరఫరా నిలిచిపోయినట్లు అధికారులు తెలిపారు. మెయిన్ సప్‌లై అధికారులకు, స్థానిక అధికారులకు సమన్వయం లేకపోవడంతో స్థానికులు అవస్థలపాలయ్యారు.

ఎంపీడీఓగా గౌస్ బాషా బాధ్యతల స్వీకరణ



కమలాపురం : కమలాపురం ఎంపీడీఓగా గౌస్ బాషా బాధ్యతలు చేపట్టారు. ఒంటిమిట్ట ఎంపీడీఓగా పని చేస్తున్న ఆయన జిల్లాలో జరిగిన సాధారణ బదిలీల్లో ఇక్కడకు వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న జ్యోతి కర్నూలు జిల్లా మంత్రాలయంకు బదిలీ అయ్యారు. బాధ్యతలు చేపట్టిన గౌస్‌బాషా మాట్లాడుతూ మండలంలో జరుగుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేసేందుకు కృషి చేస్తానన్నారు. అలాగే ప్రభుత్వ పథకాలు అర్హులకు అందేలా చూస్తామన్నారు.

యోగాభ్యాసంపై అవగాహన



యోగాభ్యాస కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది, ప్రజలు

పులివెందుల టౌన్ : పట్టణంలోని ముద్దనూరు రోడ్డు సమీపంలో ఉన్న వైఎస్సార్ క్రీడా ప్రాంగణంలో శనివారం మున్సిపల్ కమిషనర్ రాముడు ఆధ్వర్యంలో ప్రజలకు యోగాభ్యాసంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా యోగా గురువు వెంకట్రామిరెడ్డి ప్రజలకు డెమో యోగా కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్డీఓ చిన్నయ్య, అధికారులు, సిబ్బంది, పట్టణ ప్రజలు పాల్గొన్నారు.

అధిక లోడుతో వెళితే కఠిన చర్యలు



వాహనాలను తనిఖీ చేస్తున్న అర్బన్ సీఐ చాంద్‌బాషా

పులివెందుల రూరల్ : ఆటోలు అధిక లోడుతో వెళితే కఠిన చర్యలు తప్పవని అర్బన్ సీఐ చాంద్‌బాషా తెలిపారు. శనివారం సాయంత్రం స్థానిక పట్టణంలోని నల్లపురెడ్డిపల్లెకు వెళ్లే రూట్‌లో వాహనాల తనిఖీ రికార్డులు లేని వాహనాలకు జరిమానా విధించారు. అనంతరం అర్బన్ సీఐ మాట్లాడుతూ ఆటోలలో అధిక లోడుతో ప్రయాణించడం వల్ల ప్రమాదం జరిగే అవకాశం ఉందని, అధిక లోడుతో ప్రయాణం చేయవద్దని, అలా ప్రయాణం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

హెల్మెట్, డ్రైవింగ్ లైసెన్స్ తప్పనిసరి



మాట్లాడుతున్న ఎస్ఐ ఘన మద్దిలేటి


తొండూరు : స్థానిక ఏపీజీబీ వద్ద ఎస్ఐ ఘన మద్దిలేటి శనివారం వాహనాల తనిఖీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ప్రతి ఒక్క వాహనదారుడు బాధ్యతగా తలకు హెల్మెట్ ధరించి వాహనాలు నడపాలన్నారు. మద్యం సేవించి వాహనం నడిపిన వారికి కొత్తగా వచ్చిన చట్టం ప్రకారం రూ.10 వేల జరిమానా విధించి డ్రైవింగ్ లైసెన్స్‌ను రద్దు చేస్తామన్నారు. రోడ్డు కిరువైపులా టూ వీలర్, త్రీ వీలర్ వాహనాలను అడ్డంగా పెట్టరాదని, అలా పెట్టిన వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు.

అల్లుకున్న నిర్లక్ష్యం

ప్రమాదకరంగా విద్యుత్ స్తంభాలకు వైర్లు



మల్లికార్జునపురంలో విద్యుత్ స్తంభాలకు అల్లుకున్న మొక్క తీగలు



విద్యుత్ స్తంభానికి, విద్యుత్ తీగలకు అల్లుకున్న మొక్క తీగలు

పులివెందుల రూరల్ : రైతులు తమ వ్యవసాయం చేసే పంట పొలాల వద్ద విద్యుత్ స్తంభాలు ప్రమాదకరంగా ఉన్నాయి. అలాగే ప్రధాన రహదారుల్లో చీకట్లు అలుముకుంటున్నాయి. దీంతో వాహనదారులు, పాదాచారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. పులివెందుల మండలంలోని ఎర్రబల్లె పంచాయతీ పరిధిలోని మల్లికార్జునపురం, చంద్రగిరి గ్రామాల వద్ద తోటల వద్ద ఏర్పాటు చేసిన విద్యుత్ స్తంభాలకు మొక్క తీగలు అల్లుకొని ప్రమాదకరంగా ఉన్నాయి. దీంతో విద్యుత్ సరఫరాకు అంతరాయ ఏర్పడుతోంది. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ నుండి చెట్లకు విద్యుత్ సరఫరా అయితే మనుషులకు, జీవాలకు ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నాయి. కొన్నిచోట్ల ఈ మొక్క తీగలు విద్యుత్ స్తంభాలకు మాత్రమే పరిమితం కాగా, మరికొన్నిచోట్ల విద్యుత్ వైర్లకు కూడా అల్లుకున్నాయి. పులివెందుల నుంచి మల్లికార్జునపురం గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారిలో విద్యుత్ స్తంభాలుపైకి పిచ్చి మొక్కలు, వాటి తీగలు వ్యాపించి ఉన్నాయి. అలాగే పులివెందుల నుంచి లింగాలకు వెళ్లే ప్రధాన రహదారిలోని తోటల వద్ద విద్యుత్ స్తంభాలకు, విద్యుత్ వైర్లకు మొక్క తీగలు అల్లుకొని ఉన్నాయి. ప్రమాదవశాత్తు ఏదైనా ప్రమాదం జరిగే అవకాశం ఉంది. ఇప్పటికైనా విద్యుత్ శాఖ అధికారులు స్పందించి విద్యుత్ స్తంభాలు, వైర్లు చుట్టూ అల్లుకున్న మొక్క తీగలను తొలగించాలని ఆయా ప్రాంతాల ప్రజలు కోరుతున్నారు.

నేడు ప్రముఖ వైద్య నిపుణుల రాక

పులివెందుల : పట్టణంలోని స్థానిక భాకరాపురంలో ఉన్న దినేష్ మెడికల్ సెంటర్(గంగిరెడ్డి ఆసుపత్రి)లో ఆదివారం ప్రముఖ వైద్య నిపుణులు రానున్నట్లు ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. ప్రముఖ న్యూరో సర్జన్ డాక్టర్ క్రాంతికుమార్ మెదడు, వెన్నుముక, నరాలు, తిమ్మిర్లు, వంటి ఒళ్లు నొప్పులకు వైద్య చికిత్సలు అందిస్తారన్నారు. కర్నూలు విశ్వభారతి ఆసుపత్రి నుంచి ప్రముఖ గుండె జబ్బుల వైద్య నిపుణులు డాక్టర్ హితేష్‌రెడ్డి గుండె సంబంధిత జబ్బులకు వైద్య చికిత్సలు అందిస్తారన్నారు. ప్రముఖ క్యాన్సర్ వ్యాధి నిపుణురాలు డాక్టర్ డి.నిహారిక క్యాన్సర్ అవగాహన మరియు స్క్రీనింగ్, క్యాన్సర్ రోగులను క్రమ తప్పకుండా అనుసరించడం మరియు ఇతర క్యాన్సర్ సంబంధిత సంప్రదింపులు ఉంటాయన్నారు. ఈ నరాల, గుండెజబ్బుల, క్యాన్సర్ సమస్యలతో బాధపడుతున్నవారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అలాగే ఆసుపత్రిలో నూతనంగా డయాలసిస్ సెంటర్ ప్రారంభించడం జరిగిందని, కిడ్నీ సేవలు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటాయన్నారు. వివరాలకు 9963170177, 08568286189 అనే ఫోన్ నెంబర్లకు సంప్రదించాలన్నారు.

జీతాలు ఇచ్చి కార్మికులను ఆదుకోండి

వేంపల్లె : గ్రామ పంచాయతీలో పనిచేసే కార్మికులకు జీతాలు ఇచ్చి ఆదుకోవాలని సర్పంచ్ ఆర్.శ్రీనివాసులు తెలిపారు. మైలవరం మండలం వేపరాల నుండి బదిలీపై వచ్చిన మాధవరెడ్డి వేంపల్లె గ్రామ పంచాయతీ ఈఓగా శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా సర్పంచ్ ఈఓను మర్యాద పూర్వకంగా కలిసి గ్రామ పంచాయతీలో ఉన్న సమస్యలపై చర్చించారు. ఆరునెలలుగా పంచాయతీలో పనిచేస్తున్న కార్మికులకు జీతాలు ఇవ్వకపోవడంతో కార్మికుల కుటుంబాలు సతమతమవుతున్నాయన్నారు. కాబట్టి వెంటనే జీతాలు పంపిణీ చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. తాగునీరు, పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టిపెట్టి గ్రామ పంచాయతీ అభివృద్ధికి కృషి చేయాలన్నారు. మాధవరెడ్డి ఈఓగా బాధ్యతలు స్వీకరించడంతో టీడీపీ, వైసీపీ, వార్డు మెంబర్లు, కాంగ్రెస్ నాయకులు కూడా కలిసి అస్తవ్యస్తంగా ఉన్న పారిశుధ్యంపై చర్యలు తీసుకోవాలని కోరారు. అందరి సహకారంతో గ్రామ పంచాయతీని పరిశుభ్రంగా ఉంచేవిధంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

ఘనంగా ఎడిఫై పాఠశాల ప్రారంభోత్సవం



పాఠశాలను ప్రారంభిస్తున్న మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి

చింతకొమ్మదిన్నె : మండలంలోని బుగ్గలేటిపల్లి వద్ద ఏర్పాటుచేసిన ఎడిఫై పాఠశాలను రోడ్లు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్ధనరెడ్డి శనివారం ప్రారంభించారు. దేశవ్యాప్తంగా అనేక బ్రాంచీలు గల ఎడిఫై పాఠశాల సంస్థ తమ శాఖను వాగ్దేవి ట్రస్ట్ వారి ఆధ్వర్యంలో రిటైర్డ్ డీఎఫ్ఓ సుబ్బారెడ్డి చైర్మన్‌గా కడపలో ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కడప ప్రాంత పిల్లలకు మంచి విద్యాబోధన అందించాలని, విద్యతోపాటు క్రమశిక్షణ, ఆటలు అందించి ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలని ఆయన కోరారు. మాజీ ఎమ్మెల్సీ పుత్తా నరసింహారెడ్డి మాట్లాడుతూ ఎడిఫై పాఠశాలను కడపలో అందులోనూ చింతకొమ్మదిన్నె ప్రాంతంలో ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఎడిఫై పాఠశాలల జాతీయస్థాయి ఎండీ అగర్వాల్ మాట్లాడుతూ తమ సంస్థకు దేశవ్యాప్తంగా అనేక శాఖలు ఉన్నాయన్నారు. పాఠశాలలో నాణ్యమైన విద్యతో పాటు పిల్లలకు తగిన కమ్యూనికేషన్ స్కిల్స్‌పై శిక్షణ ఇస్తామన్నారు. పాఠశాల చైర్మన్, రిటైర్డ్ ఐఎఫ్ఎస్ అధికారి సుబ్బారెడ్డి, పాఠశాల ఎండీ సునీల్‌కుమార్‌రెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో తుడా చైర్మన్ దివాకర్‌రెడ్డి, ఎస్వీ పెరుమాల్ ఇంజనీరింగ్ కళాశాల వైస్ చైర్మన్ రావూరి బాలాజీ, పాఠశాల సెక్రటరీ మద్దిలేటిరెడ్డి, ట్రెజరర్ నాగరాజు, ప్రిన్సిపాల్ భూమిక మాలవీయ, స్థానిక మండల నాయకులు పాల్గొన్నారు.

లక్ష గృహాలకు సోలార్ లక్ష్యం



ప్రజలతో మాట్లాడుతున్న ఎస్ఈ

జమ్మలమడుగు : జిల్లాలో లక్ష గృహాలకు సోలార్ టాప్ లక్ష్యంగా నిర్ణయించామని విద్యుత్‌శాఖ ఎస్ఈ ఎస్.రమణ తెలిపారు. శనివారం మండలంలోని మోరగుడి ప్రాంతంలో స్థానిక ప్రజలకు సోలార్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటిపైనా సోలార్ రూఫ్ నిర్మించుకునే వారికి ప్రభుత్వ బీసీలకు రాయితీలను ఇస్తుందన్నారు. ప్రధానమంత్రి సూర్య ఘర్ యోజన పథకం ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సబ్సిడీలు పొంది సోలార్ రూఫ్ ఏర్పాటు చేసుకోవచ్చునన్నారు. సోలార్ రూఫ్ టాప్‌ను ఏర్పాటుకు సబ్సిడీ పోను పెట్టిన పెట్టుబడి వ్యయం తక్కువ సమయంలో తిరిగి వస్తుందన్నారు. రానున్న కాలంలో విద్యుత్ ద్వారా వాతావరణంలో కాలుష్యాలను నివారించవచ్చునని తద్వారా వాతావరణ వేడిశాతాన్ని తగ్గించవచ్చునన్నారు. కార్యక్రమంలో ఈఈ రమణారెడ్డి, డీఈఈ రాజగోపాల్, ఏఈ రజనీకాంత్‌రెడ్డి, ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో గిట్టుబాటు ధరలు



పంటలను పరిశీలిస్తున్న డీపీపీ

జమ్మలమడుగు : ప్రకృతి వ్యవసాయంలో పలు రకాల అంతర పంటలు, బయోడైవర్సిటీ పంటలు వేయడం వలన రైతులకు ఆదాయంతోపాటు నేలలోని సూక్ష్మ జీవులకు సరైన పోషకాహారం అందుతుందని డీపీపీ కరీమున్నిసా తెలిపారు. శనివారం మండలంలోని పి.బొమ్మెపల్లి, అంబవరం ప్రాంతాలలో ఆమె పంట సాగును పరిశీలించి మాట్లాడి రైతులకు పలు సూచనలు చేశారు. ప్రభుత్వం ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తోందన్నారు. ఖరీఫ్ కంటే ముందు పీఎండీఎస్ చేయాలని సూచించారు. రైతులు బయో డైవర్సిటీ పంటలు వేయడం ద్వారా ఆదాయం సంవత్సరం పొడవునా ఉంటుందన్నారు.

ప్రమాదాలు జరుగుతున్నా పట్టించుకోరా..!



ప్రమాదకరంగా ఉన్న వైఎస్సార్ సర్కిల్ రింగ్ రోడ్డు

పులివెందుల రూరల్ : పట్టణంలోని ముద్దనూరు రోడ్డులో ఉన్న వ్యవసాయ మార్కెట్ యార్డు సమీపంలోని వైఎస్సార్ సర్కిల్ రింగ్ రోడ్డు మధ్యలో దెబ్బతినడంతో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇక్కడ నిత్యం ప్రమాదాలు జరుగుతున్నా సంబంధిత అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారే తప్ప ఎటువంట చర్యలు చేపట్టడంలేదు. రాత్రి సమయాలలో లారీలు, ఆటోలు, ట్రాక్టర్లు, ద్విచక్ర వాహనదారులు వేగంగా వస్తుండటంతో నిత్యం ప్రమాదం జరుగుతున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఎటువంటి ప్రాణనష్టం జరగకముందే రోడ్డును సరిచేయాలని ప్రజలు కోరుతున్నారు.

కార్మికుల పిల్లలకు తల్లికి వందనం వర్తింపచేయాలి



ఆందోళన చేస్తున్న మున్సిపల్ కార్మికులు

కడప కార్పొరేషన్ : ఔట్ సోర్సింగ్ కింద పనిచేస్తున్న మున్సిపల్ కార్మికుల పిల్లలకు తల్లికి వందనం వర్తింపజేయాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ నగర అధ్యక్షుడు ఎస్.రవి డిమాండ్ చేశారు. స్థానిక పాత మున్సిపల్ కార్యాలయం వద్ద నగర కమిటీ ఆధ్వర్యంలో శనివారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో పనిచేస్తున్న 48 వేల మంది మునిసిపల్ ఇంజినీరింగ్, పారిశుద్ధ్య కార్మికుల పిల్లలకు తల్లికి వందనం నిధులు జమ కాకపోవడం అన్యాయమన్నారు. ఆదాయ పరిమితితో సంబంధం లేకుండా ప్రభుత్వ సంక్షేమ పథకాలన్నీ కార్మికులకు వర్తింపజేస్తామని ప్రభుత్వాలు హామీలు ఇచ్చాయన్నారు. మున్సిపల్ కార్మికులు, అంగన్వాడీ, ఆశ కార్మికుల పిల్లలకు మొండిచేయి చూపారన్నారు. తక్షణమే ముఖ్యమంత్రి స్పందించి మున్సిపల్ పారిశుద్ధ్య ఇంజినీరింగ్ కార్మికులతోపాటు స్కీం వర్కర్లందరికీ తల్లికి వందనంతోపాటు ఇతర ప్రభుత్వ సంక్షేమ పథకాలను వర్తింపజేస్తూ ఉత్తర్వులు జారీ చేయాలని కోరారు. లేనిపక్షంలో రాబోయే రోజుల్లో పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నగర సహాయ కార్యదర్శి ఇ.ప్రకాష్, డ్రైవర్ యూనియన్ కార్యదర్శి కిరణ్, నాయకులు నాగరాజు, సి.పి.అరుణ్, హరి, రవి, నరసింహులు, రాజా, హజరత్, నవకాంత్ సుబ్బరాయుడు, మరియు కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

తల్లికి వందనం.. పూర్తిస్థాయిలో అమలుచేయాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్ : ఎన్నికలలో ఇచ్చిన హామీ మేరకు తల్లికి వందనం పథకం పూర్తిస్థాయిలో అమలు చేయకపోవడం సిగ్గుచేటు అని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎద్దురాహుల్, వీరపోగురవి అన్నారు. కడప కోటిరెడ్డి సర్కిల్‌లో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో శనివారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఒకటో తరగతి నుంచి 12 వరకు తరగతి చదువుతున్న ఎంత మంది విద్యార్థులు ఉంటే అందరికీ రూ.15వేలు ఇస్తామని హామీ ఇచ్చి.. ఇపుడు మాట తప్పడం తగదన్నారు. 2024–25లో బురిడీ కొట్టింది.. ఇపుడు ఇచ్చిన సొమ్ములో రూ.2వేలు మినహాయించారన్నారు. 300 యూనిట్ల విద్యుత్తు ఉన్నా, కారు ఉన్నా.. అర్హులు కారనే నిబంధన గతంలో వ్యతిరేకించిన చంద్రబాబునాయుడు.. ఇపుడు అదే నిబంధన ఎలా అమలు చేస్తారని ప్రశ్నించారు. డిగ్రీ చదివే విద్యార్థులు ఎందరుంటే అందరికీ ఇస్తామని చెప్పి. ఇపుడు ఫీజు రీయంబర్స్‌మెంట్ లింకు పెట్టడం సరికాదన్నారు.

20 లక్షల మందికి తల్లికి వందనం ఎగనామం

- వారికి అందించాలని వైఎస్సార్ సీపీ పోరాటం
- మీడియా సమావేశంలో నియోజకవర్గ ఇన్‌చార్జి నరేన్ రామాంజులరెడ్డి



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న నరేన్ రామాంజులరెడ్డి

కమలాపురం : రాష్ట్రంలో 87 లక్షల మంది విద్యార్థులుంటే 67 లక్షల మంది విద్యార్థులకే తల్లికి వందనం కూటమి ప్రభుత్వం వర్తింపజేసిందని, మిగిలిన 20 లక్షల మంది విద్యార్థులకు కూడా పథకం అమలు చేయాలని వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో పోరాటం చేస్తామని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి నరేన్ రామాంజులరెడ్డి స్పష్టం చేశారు. శనివారం స్థానిక పార్టీ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. సంపద సృష్టిస్తా అని చెప్పిన చంద్రబాబు ఆ దిశగా అడుగులు వేయడం లేదని, అప్పులు చేసే రాష్ట్రాన్ని నెట్టుకు వస్తున్నారని ఎద్దేవా చేశారు. గతంలో ఒక్క ఏడాది ఏవరూ చేయనంత అప్పు చంద్రబాబు చేశారన్నారు. ప్రభుత్వం ఏర్పడిన ఏడాదిలో రూ.1.50 లక్షల కోట్లు అప్పు చేసిన ఘనత చంద్రబాబుదేనన్నారు. తల్లికి వందనం పథకం కూడా రూ.1400 కోట్లు అప్పు చేసి అమలు చేశారన్నారు. సంపద ఏలాగూ సృష్టించలేకున్నారని, అప్పులు చేస్తూనే ఉన్నారని, అలాంటి సమయంలో గత ఏడాది తల్లికి వందనం ఎందుకు అమలు చేయలేదని ప్రశ్నించారు. ఈ ఏడాదిలో ఈ ఒక్క పథకమే అమలు చేశారని గుర్తు చేశారు. ఈ పథకం కూడా 20 లక్షల మంది విద్యార్థులకు దూరం అయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆ 20 లక్షల మంది విద్యార్థులకు కూడా పథకం అమలు చేయాలని వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున పోరాటం చేస్తామని హెచ్చరించారు. గత ప్రభుత్వం అప్పులు చేస్తోందని ఢంకా బజాయించిన చంద్రబాబు ఆయన చేస్తున్న పనేంటి అని సూటిగా ప్రశ్నించారు. జగనన్న ప్రభుత్వం 50 లక్షల మందికి అమ్మఒడి ఇస్తే కూటమి ప్రభుత్వం 67 లక్షల మందికి తల్లికి వందనం ఇస్తామని లోకేష్ చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. జగనన్నతో పోటీ పడాలంటే సంఖ్యా పరంగా కాదని, చేసిన అభివృద్ధితో, అమలు చేసిన పథకాలతో పోటీ పడాలని హితవు పలికారు. దేశంలోనే మొట్ట మొదటి సారిగా అమ్మ ఒడిని జగనన్న ప్రవేశ పెట్టారని గుర్తు చేశారు. అలాగే స్కూళ్లు తెరిచిన రోజే విద్యా సామగ్రి కిట్టుతో పాటు రోజుకో మెనూతో పౌష్టికాహారం అందించిన ఘనత జగనన్నదేనన్నారు. 2019 నాటికి 34 లక్షల మంది విద్యార్థులుండగా ప్రస్తుతం 45 లక్షల మంది విద్యార్థులున్నారంటే అది జగనన్న ఘనతేనని స్పష్టం చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లీష్ మీడియంతో పాటు సీబీఎస్ఈ సిలబస్‌ను జగనన్న ప్రవేశ పెట్టారని, కూటమి ప్రభుత్వం మాత్రం వాటిని రద్దు చేసి ప్రైవేట్ స్కూళ్లను ప్రోత్స హిస్తోందన్నారు. సూపర్ సిక్స్ పథకాల్లో 3 పథకాలు అమలు చేయలేమని చంద్రబాబు పరోక్షంగా ప్రస్తావిస్తున్నాడన్నారు. నేను తప్పా ఈ రాష్ట్రాన్ని ఎవరూ బాగు చేయలేరని, నేనే రక్షకుడని చెప్పిన చంద్రబాబు భక్షకుడిగా మారారని ఆరోపించారు. సంక్షేమ పథకాల ద్వారా మానవులను అభివృద్ధి చేసిన రక్షకుడు జగనన్న అని ఆయన స్పష్టం చేశారు. ఈ సమావేశంలో వైఎస్సార్ సీపీ నాయకులు ఉత్తమారెడ్డి, రాజుపాళెం సుబ్బారెడ్డి, సంబటూరు ప్రసాద్‌రెడ్డి, సుమిత్రా రాజశేఖర్‌రెడ్డి, మహ్మద్ సాదిక్, మారుజోళ్ల శ్రీనివాసరెడ్డి, ఆర్‌వీఎస్ఆర్, లక్ష్మీనారాయణరెడ్డి, జగన్‌మోహన్‌రెడ్డి, ఇర్ఫాన్, గఫార్, గౌస్ మున్నా, రామసుబ్బారెడ్డి, సుబ్బన్న, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ

పెండ్లిమర్రి : మండలంలోని వెల్లటూరు గ్రామానికి చెందిన మాజీ సాక్షి విలేకరి ఈ రామలక్ష్మిరెడ్డి అనారోగ్యంతో మృతి చెందాడు. శనివారం మృతుని కుటుంబ సభ్యులను వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పి.నరేన్ రామాంజులరెడ్డి పరామర్శించి ఆయన చిత్రపటానికి నివాళి అర్పించారు. కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. వెల్లటూరు గ్రామంలో అనారోగ్యంతో మృతి చెందిన సుబ్బరాయుడు కుటుంబాన్ని కూడా పరామర్శించారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ బాలయ్య, సర్పంచ్ నాగార్జునరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు అమర్‌నాథ్‌రెడ్డి, లక్ష్మిరెడ్డి, హుస్సేన్, సుదర్శన్‌రెడ్డి, గురివిరెడ్డి పాల్గొన్నారు.

రోడ్డు భద్రత నియమాలు పాటించాలి



వెల్లటూరులో వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న సీఐ చల్లని దొర

పెండ్లిమర్రి : వాహనాలు నడిపే ప్రతి ఒక్కరు రోడ్డు భద్రత నియమాలు తప్పని సరిగా పాటించాలని సీఐ చల్లని దొర తెలిపారు. శనివారం మండలంలోని వెల్లటూరు వద్ద వాహనాల తనిఖీ చేపట్టి రోడ్డు భద్రత నియమాల గురించి వాహన దారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు హెల్మెట్, నాలుగు చక్రాల వాహనదారులు సీట్ బెల్ట్ ధరించాలన్నారు. రోడ్డు భద్రత నియమాలు పాటించడం ద్వారా ప్రమాదాలను నివారించవచ్చనన్నారు. అనంతరం రికార్డు సక్రమంగా లేకుండా తిరుగుతున్న వాహనాలను అదుపులోకి తీసుకుని జరిమానాలు విధించారు.

కొత్త పింఛన్లకు మోక్షమెప్పుడో

- పట్టించుకోని కూటమి ప్రభుత్వం
- కార్యాలయాల చుట్టూ అర్హుల ప్రదక్షిణలు



కొత్త పింఛన్ల కోసం ఎదురుచూస్తున్న వృద్ధులు

సింహాద్రిపురం : గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అర్హత ఉంటే చాలు పార్టీలకతీతంగా అన్ని రకాల పింఛన్లు అందేవి. ఇళ్లవద్దకు వెళ్లి పింఛన్ నగదు పంపిణీ చేసేవారు. కూటమి సర్కారు ఏర్పాటైనప్పటి నుంచి నేటికీ కొత్త పింఛన్లు మంజూరు చేయలేదు. అర్హత ఉన్న అనేక మంది కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నా పట్టించుకునేవారు లేరు. సూపర్ సిక్స్ హామీ ఏమైంది బాబూ అంటూ నిరుపేదలు నిట్టూరుస్తున్నారు. సింహాద్రిపురం మండల వ్యాప్తంగా మంది 5268 మందికి పింఛన్లకు అర్హులు ఉన్నారు. దాదాపు 400 పైబడి వితంతువులు, వృద్ధులు, దివ్యాంగులు కొత్త పెన్షన్ల కోసం దరఖాస్తు చేసుకున్నా కొత్త పింఛన్లు మంజూరు కాలేదు. వీరంతా కొత్త పింఛన్లు ఎప్పుడు మంజూరు చేస్తారోనని ఎదురుచూస్తున్నారు. అర్హత ఉన్న పేదలకు నూతనంగా పింఛన్లు మంజూరు చేస్తామని సార్వత్రిక ఎన్నికల సమయంలో కూటమి నేతలు ప్రకటించారు. అధికారంలోకి వచ్చి ఏడాది గడుస్తున్నా నేటికీ కార్యరూపం దాల్చలేదు.

పింఛన్ కోసం ఎదురుచూస్తున్నా..



ఏడాదిన్నర క్రితం నా భర్త మృతి చెందాడు. ఎలాంటి జీవనాధారంలేదు. పింఛన్ కోసం దరఖాస్తు చేసుకుని సచివాలయం, ఎంపీడీఓ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నా. కానీ కొత్త పింఛన్లు ప్రభుత్వం మంజూరు చేయడంలేదు. నిరుపేదలకు పింఛన్ వస్తే ఆసరాగా ఉంటుంది. అలాగే ఏడాది గడుస్తున్నా అప్పట్లో ఎన్నికల కోడ్ నేపథ్యంలో భర్త మృతి చెందినా ప్రమాద బీమా కూడా రాలేదు.

– పర్వీన్, వితంతువు, సింహాద్రిపురం

అర్హులందరికీ పింఛన్లు మంజూరు చేయాలి



గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో జగనన్న అర్హత ఉంటే చాలు పార్టీలకతీతంగా పారదర్శకంగా పింఛన్లు మంజూరు చేశారు. వలంటీర్ వ్యవస్థ ద్వారా ఇళ్ల వద్దకే వెళ్లి పింఛన్లు పంపిణీ చేయించారు. అధికారంలోకి వచ్చి ఏడాది గడుస్తున్నా కూటమి ప్రభుత్వం కొత్త పింఛన్లు మంజూరు చేయకపోవడం సరికాదు. ఎంతో మంది కొత్త పింఛన్ల కోసం ఎదురుచూస్తున్నారు. అర్హత ఉన్న ఒక్కరికీ పార్టీలకతీతంగా పారదర్శకంగా పింఛన్లు మంజూరు చేయాలి.

– బీఎన్ బ్రహ్మనందరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకుడు, సింహాద్రిపురం

నేడు ప్రతిభా పురస్కారాల పంపిణీ

కడప కోటిరెడ్డిసర్కిల్ : పదో తరగతిలో ప్రతిభ చూపిన తొగటవీర క్షత్రియ విద్యార్థులకు ప్రతిభ పురస్కారాలు ఆదివారం అందజేయనున్నట్లు తొగటవీర క్షత్రియ సంక్షేమ సంఘం కడప నగర శాఖ అధ్యక్షుడు కళ్యాసుధాకర్, ప్రధాన కార్యదర్శి పల్లా నరసింహారావు తెలిపారు.

సంఘం కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ ఆదివారం ఉదయం పది గంటలకు పాత రిమ్స్‌లోని బీసీ భవన్‌లో ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివి అత్యధిక మార్కులు సాధించిన 59 మందికి నగదు పురస్కారాలు, ప్రశంసా పత్రాలు, జ్ఞాపిక అందజేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ ఉమ్మడిశెట్టి సుబ్రహ్మణ్యం, ఆర్గనైజింగ్ కార్యదర్శి పల్లా మురళీకృష్ణయ్య, కోశాధికారి టేకూరి సుదర్శన్, ఉపాధ్యక్షులు చౌడం సూరిబాబు, బొలిశె ట్టివెంకటస్వామి, పల్లా బాల చౌడన్న, దొండ్ల వెంకటరమణ పాల్గొన్నారు.

పుష్పగిరికి 'ఇన్వర్టర్' ఇప్పించండి!

కడప కల్చరల్ : ప్రముఖ పంచనది క్షేత్రమైన పుష్పగిరి ఆలయానికి ఇన్వర్టర్ ఏర్పాటు చేయాలని చరిత్ర కారులు బొమ్మిశెట్టి రమేష్ కోరారు. విలేకరులతో శనివారం ఆయన మాట్లాడుతూ ఈ క్షేత్రానికి ఎంతో గొప్ప చరిత్ర ఉందని, వసతుల లోపమే ప్రధాన కారణమని తెలిపారు. భక్తులు వచ్చినపుడు కొద్ది సేపు గడిపేందుకు అవకాశం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామీణ నేపథ్యం గల ఆలయంలో బల్బులు వెలగాలని, ఇందుకు ఇన్వర్టర్ అవసరం ఉందని తెలిపారు. దాతలు, భక్తులు అవసరమైన ఏర్పాట్లు చేయాలని ఆయన కోరారు.